# అనురాగ

లల్లాదేవి

ఆమె కిరాత కాంత!

అది శ్రేణికట్టిన హిమసానువుల పాద భూమి!

అప్పుడప్పుడే కుంకుమ చూర్ణంలా ఉదయించినాడు బాలభానుడు. రవికాంతుల కరస్పర్శతో పులకాంకితమౌతోంది తుషారరాసి!

కరిగి జారిన మంచు ముద్దలు సెలయేళ్ళుగా మారి గల గలమని పారుతున్నాయి. ప్రాతఃకాల శీతల సమీరాలు శరీరాన్ని సోకి జల్లుమనిపిస్తున్నాయి.

సెలయేటి పొడవునా మణిమయ సమూమ్నాయుమ్మై అరుణోజ్వలంగా తరళిస్తున్నాయి. దాడిమీ పుష్పాలు.

దానిమ్మ పువు రేకుల కోమల కాంతి పరిష్టతవి తలదన్నే అరుణాధరాలతో మందస్మితం చేసిందామె. ఎర్రని పెదవులు రవంత వొంపు తిరిగినాయి.

ఇంద్ర ధనుస్సులు విరిగిపడినట్లే అయింది. దొంతరగా తొంగిచూచిన దంత కాంతులు అంతలో మెరిసి మాయమయ్యే విద్యుల్లతల్ని తలపిస్తున్నాయి.

రాగిని కరగించి పోత పోసినట్లుగా ఉన్న ఉజ్వల శరీర కాంతితో పరిసరాలు దేదీప్యమానమవుతున్నాయి. ఒంటికి అంటిపెట్టుకున్న వలువలన్నీ ఊడ్చి ఒక పెద్ద శిలావేదిక పైనుంచి సెలయేటి జరధారలలోకి దుమికిందామె.

ఇది హిమసానువుల పాద భూమిలో ప్రతి ఉదయమూ కన్పించే అద్భుత దృశ్యం!

ఆమె సాధారణ స్త్రీ కాదు. కిరాత వనితానేత! మహా పరాక్రమశాలిని! ఆమె గురిచూచి బాణం కొడితే కొండల గుండెలయినా రెండుగా చీలుతాయి.

ధనుస్సు ఎత్తున (ఆరడుగుల రెండంగుళాలు) వుండే ఆ కిరాత కాంత చువ్వీటె చేతపడితే మృగేంద్రాలయినా తోక ముడిచి పారిపోవలసిందే! ఆమె నేత్రాలను విశాలం చేస్తే విస్ఫులింగాలను కురిసినట్లుంటాయి.

తొడ చరచి పెడబొబ్బపెట్టి పెమరంకె వేస్తే మానవ రక్తం రుచి మరిగిన బెబ్బులులు అయినా బావురుపిల్లులవుతాయి. ఆమె కనురెప్ప కదలితే మ్లేచ్ఛ కిరాత జాతులు ఉత్తుంగ జలధి తరంగాల్లా విరుచుకుపడతాయి.

తూర్పున లలితపట్నం నించి పశ్చిమాన తక్షశిల, శబ్దగ్రాహిల వరకూ మ్లేచ్ఛ, కిరాత జాతులు హిమ పర్వత పాద భూములలో స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. అక్కడ వారిదే పైచేయి. వారు పాడిందే పాట!

కొండ గుండెలు ప్రతిధ్వనించేలా గొంతెత్తి వీర గీతాలను ఆలపిస్తోంది కిరాత కాంత. సెలయేటి గలగలలు మృదంగ వాదాలై సహకరిస్తున్నాయి.

శీతవాతాలను లెక్కించక మంచు కరిగిన నిర్మలోదకాలలో ఈదులాడి తిరిగి శిలా వేదిక మీదికి వచ్చిందామె. శరీర సౌష్టవానికి అనుగుణంగా కాలి పిక్కలు రాతి ముక్కల్లా కన్పిస్తున్నాయి. ఊరువులు పోతపోసిన తామ్ర వర్ణంలో తరళాయితాలవుతున్నాయి. నాభి ప్రేలటానికి సిద్ధంగా ఉన్న గంధక పర్వతంలోని బిలంలా కన్పిస్తోంది.

వక్షస్సు బోర్లించిన తామ్ర మధుపాత్రలా కన్పిస్తోంది. నీలి కుంతలాలు వీపు దాటి, కటి దాటి, కాలిమడతల దాకా జీరాడుతున్నాయి.

వలువలు ధరించి ఊర్పు విడిచి చుట్టూ పరికించి చూచిందామె. విల్లమ్ములు చేతపట్టుకుంది. తిరిగి తన ఆవాసానికి బయలుదేరుతూ వుండగా కేకలు విన్పించినాయి. పాహి. పాహి. రక్ష; రక్ష!

కొద్ది క్షణాల అనంతరం ఆర్తిపూర్వకంగా వినిపించే ఆ కేకలు మరింత దగ్గర అయినాయి.

ఎవరో తనను శరణు వేడివస్తున్నారని గ్రహించింది కిరాత కాంత. పురోగమించేందుకు వేయబూనిన అడుగును నిలుపు చేసుకుంది.

కనుబొమ్మలపై అరచేయి అడ్డుంచుకుని ఆ వంకకు చూడసాగింది.

దూరం నించి కషాయ వర్ణాంబరధారులు గుంపు కట్టి రావటం కన్పించింది.

త్రాహి త్రాహి అని అరుచుకుంటూ వారు పరుగెడుతున్నారు. ఆ వెనుక కొందరు సైనికులు వారిని వెన్నాడుతున్నారు. ఆమె కనుబొమ్మలు ముడిపడినాయి.

సాధుజీవనులు, క్షమ, దయా ప్రబోధకులు అయిన పరివ్రాజకులను వెన్నాడి వచ్చే ఆ సైనికులు ఎవరు? అని అబ్బురపడిపోయిందామె. ముఖముద్ర ఉద్విగ్నంగా అయింది.

కషాయ వస్త్రధారులు ఆమెను చేరవచ్చినారు. వారు ధరించిన చీవరాలు మార్గాయాసం నించి అస్తవ్యస్తమయినాయి. కొందరి పిండపాత్రలు చేజారి పడుతున్నాయి.

"పాహి పాహి మాం పాహి క్షత్రిదేవీ!" అంటూ స్రోతాంతికులందరూ వచ్చి ఆమె పాదాలను ఆశ్రయించినారు.

హిమనగరాజు తనూభవ పుత్రిక అయిన శాంకరీదేవి పరిణయం నాటినించీ వారు వేద మతానుయాయులే! పరమమాహేశ్వరుడే వారికి ఆరాధ్య దైవం. లలితపట్నం నించి తక్షశిల శబ్దగ్రాహిల వరకు పరివ్యాప్తమయిన పర్వత సానువుల్లో ఆవాసముంటున్న మ్లేచ్ఛ, కిరాత జాతులవారికి మత విద్వేషం లేదు.

(తర్కబద్ధమయిన భౌతిక దృష్టి అలవడనిదే మతాలు మనుగడ సాధించలేవు. రెండు వేల సంవత్సరాలకు పూర్వం ఒక కిరాత కాంత ఎంత తార్కికంగా ఆలోచించగలదో దానికి కృత్తిదేవి కథ ఒక ఉదాహరణ. రాజతరంగిణితోపాటు రాహుల్ సాంకృత్యాయన్‌ని కూడ తీసుకున్నాను

—లల్లాదేవి)

అశోక స్రమాట్టు అంతరించిపోయాక ఆర్యావర్తంలో హిందూ బౌద్ధ మతానుయాయులు పరస్పరం కలహించుకుంటున్నారు. వైషమ్య జ్వాలలు మిన్నంటుతున్నాయి.

దయ, క్షమ, సత్యము, శౌచము, దానము, పవిత్ర జీవనము- ఇవన్నీ హిందూ మతానుయాయులు ఆదినించీ అనుసరించే సాంప్రదాయాలు. వైదికమయిన కర్మకాండలు మాత్రం రవంత వక్ర మార్గాన దిక్కు మార్చుకున్నాయి.

అందునించి పై హిందూ సాంప్రదాయికమయిన అంతర్గత లక్షణాలనే వడపోత కట్టి, ఆచరణలో మరింత సాధుత్వాన్ని సంతరించిపెట్టి బౌద్ధమనే పేరుతో బోధించినాడు విరాగి అయిన శాక్యసింహుడు.

వారయినా, వీరయినా పర మత విద్వేషాన్ని ప్రబోధించినవారు కారు. అందునించి హిమసానువుల పాద భూమిలో ఆవాసముంటున్న మ్లేచ్ఛ, కిరాత జాతులవారికి బౌద్ధులపై కించిత్తు అయినా కినుక లేదు.

వారిది వైదిక సాంప్రదాయమే అయినా, క్షమా గుణ సంపన్నులయిన స్రాంతాంతికులను సహోదరులుగానే భావించినారు; గౌరవించినారు.

హిమభూముల్లో కిరాతులవల్ల వారికి భయం లేదు. కాని ఉదయాన వీరలా దండుకట్టి పారిపోయిరావటం ఆశ్చర్యమే అనిపించింది.

అందరు ప్రాణ భయంతో వజ వజ వణికిపోతున్నారు.


"సోదర శ్రమణకులారా! మీకు వచ్చిన అపాయమేమి?" అని అడిగింది కిరాత కుల కాంత అయిన కృత్తి దేవి. పరివ్రాజకులంతా ఆమె పాదాల ముందు మోకరిల్లినారు.

"శరణు శరణు శాంకరీ! నీవు సాక్షాత్తు పరమేశ్వరుని పరపుత్రిక వని మ్లేచ్ఛ, కిరాత జాతులవారు చెప్పగా విన్నాము. శివానీ నిన్ను కన్నదట! తాతగారయిన హిమవంతుడు నిన్ను చల్లని ఒడిలో ఎత్తి పెంచినారట!

ఆపన్నుల పాలిటి నువ్వు ఆ పరమేశ్వరివట! కిరాతకుల పుంగవులంతా మా సమస్య విని పెదవి విరిచినారు. నీవు తప్ప మాకు మరొక దిక్కు లేదన్నారు. ప్రాణ భయంతో నీ పాదాలను ఆశ్రయించి వచ్చినాము. ఆపన్నులము. అభయమిచ్చిన కాని నీ శరణు విడిచిపోయేది లేదు" అంటూ మహా సాంఘికులంతా భీష్మించినారు.

ఆపన్న శరణ్య అయిన కృత్తిదేవి కనులు చెమరించినాయి.

"స్థవిరులారా! చీవరము, పిండపాత్ర చాలునని భిక్షు



చర్యలో బ్రతుకులు పునీతం చేసుకుంటున్న మీకు వచ్చిన విపత్తు ఏమి? సాధుజంతువులను వేటాడే మృగేంద్రాలున్నాయి. కాని సాధువృత్తులయిన సోదరులను వేటాడే మానవులు ఆర్యావర్తంలో లేరు కదా!

కరుణ సింధువులయిన మిమ్ములను వేటాడవచ్చిన దుష్కర్ములెవరు? ఆనాడు భగవానుడు కిరాతుడయిన అంగులీమాలునికి ఎదురేగలేదా? ప్రాణభయం వల్ల ఎంతటి మహాత్ములయినా దూదిపింజలవలె అవుతారు.

మీకు వచ్చిన భయం లేదు. నే నున్నాను. అభయమిస్తున్నాను. మిమ్ము ఆవహించిన విపత్తు ఎంతటిదయినా ఎదుర్కొంటాను. నా శరీరంలో చైతన్యధార యింకిపోనంత వరకూ మిమ్ములను ఎవరూ ఏమీ చేయలేరు.

ఇందుకు ఈ పంచభూతాలు, ఈ హిమగిరి ధరమే సాక్షి" అంటూ అభయమిచ్చింది.

ఆమె కంఠస్వరం అశనిపాతా[illegible] తలపిస్తోంది.

తీర్థంకరు లందరూ లేచి నిలచినారు. వారి కనులలో ప్రాణభీతి మటుమాయమయింది. అల్లంత దూరాన వారిని వెన్నంటి వచ్చే సేనా వాహినులను చేయెత్తి చూపినాడొక స్థవిరుడు.

"అంబా! వారు కాశ్మీర ప్రభువు అయిన జలౌకుని సైనికులు. వీరమాహేశ్వరులు. ఈ ప్రాంతాలలో దేవానాం ప్రియుడయిన ప్రియదర్శన మహా చక్రవర్తి నిర్మించియిచ్చిన చైత్యాలను విధ్వంసం చేశారు. కనిపించిన పరివ్రాజక శ్రేణిని హతమార్చుతున్నారు. కన్యాకుబ్జం మీదికి దాడి వెళ్ళి విజయగర్వంతో తిరిగి వస్తున్నారు.

ఇప్పుడు మా వెంటపడినారు. మాకు నీవే రక్ష" అంటూ సంగతాన్ని వివరించినాడు భిక్షువు.

ఆ మాటలు వింటూనే కృత్తిదేవి నేత్రాలు విశాలమయినాయి. ముఖకాంతి అమితోజ్వలంగా అయింది. సగమే ఉదయించిన రాకాసుధాకరుని మీదికి మేఘాలు అడ్డు వచ్చినట్టుగా ఫాలభాగం మీదికి ఎగసి వచ్చిన ముంగురులను తల విదలించి అడ్డు తొలగించుకుంది.

"కిరాత భూములలో పరమత విద్వేషమా? ఆ విషయమేదో నేను తెలుసుకుని వస్తాను. మీకిక విశ్రాంతి" అంటూ ధనుర్బాణాలను చేతపట్టి, సేనానివహానికి ఎదురు నడిచిందామె.

నటరాజ జటాజూటం నించి పొంగిపొరలుతున్న గంగా తరంగాలవలె ఉప్పొంగుతున్నాయి సైన్యాలు. పెద్ద పెద్ద అంగలతో వచ్చి తమ దారికి అడ్డు నిలిచిన ఆడదాయిని చూచి రవ్వ మీసం దువ్వినాడు సేనాపతి.

"ఎవరు నీవు?" అని హుంకరించినాడు.

"ఆ ప్రశ్న అడగవలసింది నేను. ఇది కిరాత భూమి. ఎవరి అనుమతితో నీవు ఈ చోటున చొరబడినావు?" అని ఎదురు ప్రశ్న వేసింది కిరాతకుల తిలకమయిన కృత్తిదేవి.

ఈ ప్రశ్న విని కొండల మీదినించి బండలు దొర్లి పడుతున్న విధంగా నవ్వాడు చమూపతి.

"మాకు ఒకరి అనుమతితో పని ఏమున్నది? చూచినావు కదా నా వెనుకనున్న సేనానివహము? నా దారికి అడ్డు నిలిచినా ఆడదాయివన్న ఆలోచనతో నీకు ప్రాణభిక్ష పెడుతున్నాను. నా దారి తొలగిపో" అంటూ హెచ్చరించాడు వాహినీ విభుడు.

ఒకసారి ఆ వంకకు తేరి చూచింది కృత్తిదేవి. ఆ పైని అరుణాధరాలు చిరునవ్వుతో రవంత విచ్చుకున్నాయి.

"సోదరా! నీవు వీరుడవా? సేనాపతివా? నిన్ను సేనానిగా నియమించుకున్న ఆ రాజు ఎంత అవివేకి. ఆడ దానను. ఒంటరిదానను. కోదండం తప్ప మరే తోడూ లేనిదానను కదా!

నాకు నీ వెనుకనున్న సేనావాహినులను చూపుతున్నావా? ఎంత తెలివిమాలినవాడవోయీ! ఈ ఒంటరి ఆడదాన్ని భయపెట్టేందుకు నీ పరాక్రమం చాలదా? అపార సేనా వాహినులు కావలసివచ్చినాయా?" అన్నదామె పరిహాసంగా!


ఆ మాటలు సేనాపతి కవచాన్ని చీల్చుకుని గుండెల్ని తాకినాయి. అతడు కినుక వహించి యవనాశ్వం మీది నించి ఉరికి వచ్చినాడు.

"కిరాతకీ! ఏమి నీ వాచాలత? నేను ఎవరనుకున్నావు? మగధ మహామండలేశ్వరుడయిన ఆ నాటి అశోక చక్రవర్తి ఔరస పుత్రునకు సర్వసేనాధ్యక్షుడను.

కాశ్మీర కుంకుమ అలదినట్లుగా కన్పించే ఈ కార్తికేయ ఖడ్గంతో శత్రువులను నిర్ధూమధామంగా ఖండించిన చిహ్నాలు కన్పించుటలేదా?

అయినా కిరాత కాంతవు. నీతో మాటలాడు పని ఏమి? నేను కార్యవ్యగ్రుడనయిపోతున్నాను. దారి వొదులు" అని గర్జించినాడు సేనాపతి.

"ఏమిటా కార్యవ్యగ్రత?" వొక్కి ప్రశ్నించింది కృత్తిదేవి.



యజ్ఞయాగాది కర్మలను నిరసించే బౌద్ధులు కొందరు ఈ వంకకు వచ్చినారు. వారిని పట్టి జలౌకునికి అప్పగించాలి'' అని చెప్పాడు జలౌకుని సేనాని.

ఆ మాటలకు విరగబడి నవ్వసాగింది కిరాత వనిత!

“ఓయీ! అహింసావాదులయిన వైభాషికులతో మీ రాజున కేమి పని. నీవు ఆడువారిని, మీ రాజు అహింసావాదులను బాధించటం అరాచరికమే కదా! ఇటువంటి అకార్యాలను నిర్వహించటం కిరాత భూముల్లో చెల్లనేరదు'' అన్నదామె కఠినంగా.


తనను కాక తన మండలేశ్వరుని కూడా నిరసించి మాట్లాట్టం సేనానికి తలవొంపు అనిపించింది.

“వాచాలినీ నీ వెవరు?'' అన్నాడతడు అసహనంగా!

“నేను వైదిక మతానుయాయిని అయిన కిరాత కాంతను. లలితపట్నం నుంచి శబ్దగ్రాహి వరకు పరివ్యాప్తమయిన పర్వత పాద భూములలో ఉన్న మ్లేచ్ఛ, కిరాత గణాలకు అధినాయికను. నా పేరు వినలేదా? అహంభో కృత్తిదేవీ శామ్మి'' అంటూ ప్రవర చెప్పుకుంది.

ఆ పేరు వింటూనే సేనాని కరతలాన మెరిసే కార్తికేయ ఖడ్గం జారి క్రింద పడింది.

ఆమె కనుసన్న చేస్తే కిరాత



సేనలు ఉత్తుంగ జలధి తరంగాలవలె ఉప్పొంగుతాయి.

కాశ్మీరం నుంచి మగధ మహామండలం పరిహద్దులు తాకిం దాకా వెన్నంటి తరుముతాయి.


ఆ విషయం తెలుసుకోగానే అతనికి మతి పోయినంత పని అయింది.

“సహోదరీ! క్షంతవ్యుడను. మన వైదిక సాంప్రదాయానికి గొడ్డలి పెట్టులా దాపురించినారీ పరివ్రాజకులు. వీరంతా నాస్తికులు. పాషండులు. చార్వాక మతానుయాయులు. వీరిని ఉపేక్షించి వదిలేస్తే వైదిక కర్మలు విఘ్నాలవుతున్నాయి. అనాత్మవాదం మోసులెత్తుతుంది. వారు నాకే కాదు; నీకు కూడ ప్రత్యర్థులే'' అన్నాడతడు.

“అయినా వారికి నేను శరణు ప్రసాదించినాను. ఆ వంకకు నీవు కన్నెత్తి చూడరాదు. వారిని పట్టి బంధించా లంటే నీవు ధనుష్పాణిని అయిన నన్ను జయించి మరీ పోవాలి'' అన్నదామె. అంతటితో అతని ఆశలు అడుగంటినాయి.

“ఇది రాజాజ్ఞ- ధిక్కరించరానిది'' అన్నాడు కృంగిపోయి.

“తర్కబద్ధంకాని మత విశ్వాసాలు మత్తుమందులా పనిచేస్తాయి. సోదరా! మతాలు మానవ కల్యాణ ప్రదాయికాలు కావాలి. కాని, మారణహోమాన్ని సృష్టించకూడదు. రాజ దర్శనా కాంక్షతో నేను బయలుదేరాను. నా పేరి




విశ్వాసంతో సైన్యాలను మరలించు'' అన్నదామె.

అతడు తిరిగి అశ్వాన్ని అధిరోహించినాడు.

మాగధేయ మహా సైన్యం తిరుగు ప్రయాణమయింది.

** ** **

జతాకుడు మగధరాజ ప్రతినిధిగా కాశ్మీర దేశానికి వచ్చాడు. అతడు అమిత్రఘాత బిరుదాంకితుడయిన మగధ మహామండలేశ్వరుని మనుమడు. దేవానాం ప్రియదర్శను డయిన అశోక సమ్రాట్టుకు పౌరుడు.

ప్రియదర్శుని అర్ధాంగులయిన శాక్య కుమారికి కాని, కారువాకి, అసంధిమిత్రలకు కాని, పద్మావతికి కాని మానస పుత్రుడు కానే కాదు.

చిన్నారి భార్య అయిన తిష్యరక్షిత మనోభావాలకు ప్రతి రూపం జతాకుడు. ఆమె భార్యగా అసంతుష్ట నారీమణి. దురదృష్టవశాత్తు తిష్యరక్షితను పెండ్లాడిన బహు కొద్ది కాలానికే ప్రియదర్శుడు కళింగ భూములపై దాడి వెడలి నాడు.

కాళింగుల ఆత్మార్పణం అతనిలో తీవ్ర పరితాపానికి కారణమయింది. తండ్రి అయిన అమిత్రఘాతుడు దక్షిణా పథం యావత్తూ జయించి కళింగ భూముల జోలికి వెళ్ళకుండా తిరిగి వచ్చిన కారణం అప్పుడాతనికి అర్థ మయింది.

కాని మాగధేయుల ప్రతిష్ఠ కోసం పోరాటాన్ని కొనసాగిం చాడు. ఫలితాంశం మనస్తాపమే! మొగ్గలా పుత్రుని వల్ల ప్రేరితుడై అక్కడికక్కడే బౌద్ధాన్ని స్వీకరించాడు.

బౌద్ధ సిద్ధాంతాల ప్రభావం వల్ల అంతఃపుర కాంతలను నిర్లక్ష్యం చేశాడు. ఆ తరువాత ధర్మచక్ర ప్రవర్తనం పేరుతో దేశాటనం కొనసాగించాడు. అది పూర్తి అయే నాటికి వృద్ధుడయినాడు. ఈ కారణాలవల్ల తీవ్ర నిర్లక్ష్యానికి గురి అయింది తిష్యరక్షిత. ఆమెలోని అసంతృప్తి జ్వాలలు బౌద్ధంపట్ల ప్రతీకారంగా మారినాయి. మంత్రుల సాయంతో బ్రాహ్మణులకు, బౌద్ధులకు కోశాగారాన్ని ప్రభువు దోచిపెడు తున్నాడన్న నెపంతో ప్రచ్ఛన్నమయిన తిరుగుబాటు కార్య క్రమాలు కొనసాగించిందామె.

అశోక చక్రవర్తి ధర్మచింతన చేసే బోధివృక్షాన్ని కొట్టివేయ సాహసించింది కూడ. అయితే ప్రభువు క్షమా మూర్తి అయినాడు. చండాశోకుడుగా ఉండగా ఆగ్రహన చేతలను విమర్శించగల ధీశాలురు మొత్తం భరత ఖండంలో లేరు.

ఇప్పుడు వృద్ధుడు. అలలు ఆగిపోయిన సముద్రంలా కామనలను, రాగద్వేషాలను అరికట్టిన గంభీరుడు.

అందువల్ల తిష్యరక్షితను క్షమించి దక్షిణాపథంలోని జొన్నగిరికి (సువర్ణగిరి - కడప జిల్ల మనశ్శాంతిని వెతుక్కుంటూ వెళ్ళిపోయాడు మహా చక్రవర్తి.

అలాంటి తిష్యరక్షిత మనోభావాలకు ప్రతిరూపం జతా కుడు.

అతడు శైవుడే కాక శాక్తేయుడు కూడా అతని కాలంలో కాశ్మీర శైవం పదార్థు వన్నెలతో తరళాయితమయింది. అందుకు అభ్యంతరాలను కల్పించే బౌద్ధులందరిని ఏరిపార వేయటం ప్రారంభించినాడు జతాకుడు.

అందులో ఒక భాగంగా కిరాత భూముల్లోని బౌద్ధులను సైనికులు వెన్నాడుతున్నారు. వీరు కిరాత వనితారత్నమయిన కృత్తిదేవిని శరణువేడటంతో పరిస్థితులు మారినాయి.

"ప్రభూ! లలితపట్నం నించి తక్షశిల దాకా పర్వత పాదభూముల్లో విస్తారంగా ఆవాసముంటున్న మ్లేచ్ఛ కిరాత జాతుల వారందరికి తిరుగులేని నాయకురాలు కృత్తిదేవి. ఆమె పరివ్రాజకులందరికి అభయమిచ్చింది'' అని విన్నవిం చాడు సేనాపతి.

జతాకుడు మండిపడ్డాడు.

"ఆమెను పట్టి బంధించండి!'' అన్నాడు క్రోధంగా.

"అది అసాధ్యం ప్రభూ!
కృత్తిదేవి కనుసన్నలలో మెలుగుతున్న మ్లేచ్ఛ కిరాత జాతులు తిరుగుబాటు చేస్తాయి. వారిని కాదని ప్రభువులయినా, పరమేష్ఠి అయినా హిమ పర్వత సానువుల్లో మనుగడ సాగించలేరు'' అంటూ వివరించాడు సేనాపతి.

ప్రభువు ఆలోచనలోన పడినాడు.

జతాకుడు మహా పరాక్రమశాలి. మృగయావినోది. అత డొకనాడు బాలెంతరాలయిన ఒక ఆడ బెబ్బులిని దెబ్బ గొట్టాడు. అది మెరుపులా విరుచుకుపడింది. పిడుగు పాటు లా పంజా విప్పి కొడుతోంది. అతనిని బాగా అలయిస్తోంది.

మృత్యు రూపిణి అయిన ఆ బెబ్బులిని వధించే దారి కానక ఇరుకున పడిపోయినాడు జతాకుడు. అలాంటి సమయంలో కనిపించని రహస్య కోణాల నించి ఓ బాణం దూసుకు వచ్చి దాని గుండెలను రెండుగా చీల్చింది.

అది పెడబొబ్బపెట్టి నేల కూలింది. తల్లి మరణంతో దిక్కుమాలినవైపోయిన పులి కూనల్ని చంకలో ఇరికించు కుని ఓ స్త్రీ మూర్తి అతని ముందు ప్రత్యక్షమయింది.

"కృతజ్ఞతలు! ఎవరమ్మా నీవు?'' అని ప్రశ్నించాడు రాజు.

"కిరాత కాంతను''

"నాకు ప్రాణదానం చేసిన వీర నారీమణీ! ఒక వరం కోరుకో! అది ఎలాంటిదయినా సరే తీర్చుతాను'' అన్నాడు రాజు. అందుకామె పెదవులు విరిశినాయి. అరుణాధరాలపై ధవళ దంతకాంతులు అందంగా ప్రతిఫలించాయి.

"రాజా! నా పరాక్రమంతో దక్కించుకున్న ప్రాణాలు నీవి! నువ్వు నాకేమి వరమివ్వగలవు. అయినా అర్థించావు కనుక ఒప్పుకుంటున్నాను. నాకు రాజభోజనం తినాలన్నది బహుకాల వాంఛ. అడిగినది కాదనకుండా పెట్టించగలవా?'' అని అడిగిందామె.

ఇంత చిన్న కోరికా? అనుకున్నాడు రాజు. "తథాస్తు'' అన్నాడు.

అతనితోపాటుగా అంతఃపురానికి వచ్చిందామె.

రాజుతోపాటుగా ఆమెకు కూడ విందుకై రాజభోజనం వడ్డించారు. ఆమె శాకపాకాలన్నింటిని పరిశీలించి పెదవి విరచింది.

"రాజా! నరమాంసమెక్కడయ్యా!'' అని అడిగింది.

"నరమాంసమా?'' అంటూ రాజు సంభ్రమపడిపోయి నాడు.

"సాటి మనిషిని వధించి మన కడుపు నింపుకోవటం అనాగరికం కాదా?'' అన్నాడు. ఆమె చూపులు అతని గుండెల్లో గ్రుచ్చుకుంటున్నాయి.


"రాజా! నీ సామ్రాజ్య విస్తరణ కోసం నీవు నరమేధం సాగించటల్లేదా? కడుపు నింపుకునేందుకు సాటి మానవుణ్ణి వధించటం అంతకన్నా ఘోరమయిన పాపమా?'' అని ప్రశ్నించింది.

రాజు సంశయాకుల చిత్తుడయినాడు.

"నీ వెవరు?'' అని ప్రశ్నించాడు అనుమానంగా!

"కృత్తిదేవిని. కిరాత మ్లేచ్ఛ వర్గాల నాయికను'' అందామె.

"ఓహో! శాస్త్రులందరికీ శరణు ప్రసాదించిన వీరవనిత నన్నమాట. బౌద్ధులందరికి ఆశ్రయమిచ్చి నరమాంసం కోరు తున్నావంటే నీవు ఏదో మిష కల్పించుకుని నాసించి వరాన్ని పొందావు. వచ్చిన కారణమేమిటో వివరించు''అన్నాడు జతాకుడు.




కృత్రిదేవి ఎంతో ప్రసన్న భావంతో చెప్పసాగింది.

"రాజా! బౌద్ధులంతా ఆర్యావర్తంలో పుట్టిన నీ సోదరులే కారా! బౌద్ధుల ఆరామాలను విధ్వంసం చేసి శంకరునికి ఆలయాలు కట్టిస్తున్నావు. అహింసామూర్తులయిన బౌద్ధులను హింసిస్తున్నావు.

రాజా! కపాలాన్ని చేత ధరించే మహా భిక్షువు అయిన పరమేశ్వరుడు బౌద్ధ భిక్షువులను హింసిస్తే ప్రసన్నుడవుతాడా! వైదికమయిన సాంప్రదాయం సహనమూ, సౌశీల్యమూ ప్రబోధించలేదా?

మేధాజీవి అయిన మానవుడు కలిసి, ద్వేషాన్ని పెంచుకోవటం వైదిక సంస్కారమా! సాటి మానవులకు అనురాగాన్ని పంచి యివ్వటం రాజుగా నీ కర్తవ్యం కాదా!

ఆర్యావర్తంలోని ప్రజలమీద అనురాగంతో కదా పవిత్ర గంగాతరంగిణి కొండల మీది నుంచి నేలకు దిగజారి ప్రవహిస్తోంది. రాజు అయిన నీవు మాత్రం వారిపై అనురాగ గంగను జాలువార్చలేకపోయినావు.

బౌద్ధులను హింసిస్తున్నావంటే దానికి అర్థం నీవు వారికి భయపడి భీరువుగా మారిపోయినావని కదా!?

రాజా! నీ సహపంక్తిన కూర్చుని నేను భోజనం చెయ్యాలంటే నీవు బౌద్ధుల చైత్యాలను విధ్వంసం చేయటం మానుకోవాలి. వారిపట్ల దయార్ద్రదృష్టి అలవరుచుకోవాలి.

వైదిక సాంప్రదాయానికి విరుద్ధమయిన పర మత విద్వేషాన్ని విడనాడాలి. అప్పుడే నీవు ఋజువయిన శివార్చనాశాలివిగా చరిత్రలో నిలిచిపోతావు. మగధేయః మహా మండలేశ్వరుల ప్రతిష్ఠకు నిజమయిన వారసుడవు కాగలుగుతావు" అన్నదామె.

వింటున్న రాజుకి మనసు మీద ఆవరించిన పొరలు తెగినాయి. జ్ఞానరోచిస్సులు అంతర్లోకంలో పరుచుకున్నాయి.

"తథాస్తు కృత్రిదేవీ! ఈ రాజ్యంలో ఇకమీదట హిందూ - బౌద్ధ మతాలు అన్యోన్యంగా సోదర భావంతో మెలుగుతాయి. ఈనాడే మత విద్వేషాలకు మంగళవాక్యం పలుకుతున్నాను" అంటూ అభయమిచ్చినాడు జలూకుడు.

సంతుష్ట తరంగితమయిన అంతరంగంతో రాజ భోజనం ఆరగిస్తోంది కృత్రిదేవి. మతకలహమనే పెనుభూతం భూస్థాపితమయినందుకు బౌద్ధులంతా హాయిగా నిట్టూర్చారు!!


దీపావళి శుభాకాంక్షలతో

సరస్వతి కెమికల్స్

నాణ్యమైన వోల్గా ప్రింటింగ్ ఇంకుల తయారీదారులు

ఫ్యాక్టరీ:
3-1-69, భవానిపురం
హైదరాబాద్ రోడ్
విజయవాడ - 520 012
ఫోన్:74784

ఆఫీసు:
27-5-16, గోపువారి వీధి,
గోపాలరెడ్డి రోడ్,
విజయవాడ - 520 002
ఫోన్: 62002